సాక్షి
వైఎస్సార్ జిల్లా

శనివారం । 22 । జూలై । 2023

I



ముగిసిన బలిజపల్లె గంగమ్మ జాతర

రాజంపేట పట్టణ పరిధిలోని బలిజపల్లె గ్రామంలో గంగమ్మ జాతర వేడుకలు ముగిశాయి. -IIలో..



చిత్తూరు జట్టు ఘన విజయం

కడపలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్-19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది. -IIలో..

గరిష్టం/కనిష్టం
32.4/24.5

వాతావరణం

జిల్లాలో శుక్రవారం 24.5 - 32.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 9.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. -కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్: అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులో గల గిరిజన సంక్షేమ గురుకుల క్రీడా పాఠశాల జోన్-4 పరిధిలో 5 , 6వ తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని నెల్లూరు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి తెలిపారు. 2022-2023 విద్యా సంవత్సరంలో గిరిజన గురుకులాలు, ఆశ్రమ, ప్రభుత్వ ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగో తరగతి పూర్తి చేసుకొని 5వ తరగతి చదువుతున్న గిరిజన బాలురు అర్హులని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఈ నెల 27వ తేదీన తిరుపతి జిల్లా రేణిగుంట్ల ఏపీ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో ఎంపిక పరీక్షకు హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9603310648 నంబర్‌లో సంప్రదించాలని చెప్పారు.

నేడు పులివెందులకు వ్యవసాయశాఖ మంత్రి రాక

పులివెందుల రూరల్: రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి శనివారం పులివెందులకు రానున్నారు. ఈ విషయాన్ని రైతు సాధికారిత సంస్థ వైస్ చైర్మన్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ఏపీ కార్ల్‌లో రైతు శాస్త్రవేత్తల కోర్సును ప్రారంభించడానికి మంత్రి వస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం రైతు సాధికారిక సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయంపై మెంటర్లకు నిర్వహించే శిక్షణా కార్యక్రమంలో మంత్రి పాల్గొంటారని ఆయన తెలిపారు. మంత్రి పర్యటించే ప్రాంతాలను పరిశీలించారు.

మంత్రికి ఘన స్వాగతం

కడప అగ్రికల్చర్: రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి శుక్రవారం సాయంత్రం కడపకు విచ్చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉద్యానశాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్ రెడ్డి, జిల్లా వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి జిల్లాలో వ్యవసాయసాగు, తదితర అంశాల గురించి చర్చించారు.వ్యవసాయంపై ముఖ్యమంత్రి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని, మీరందరు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మంత్రిని కలిసిన వారిలో జిల్లా వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఉద్యానశాఖ అధికారి మైఖేల్‌రాజీవ్, ప్రకృతి వ్యవసాయ డీపీఎం రామక్రిష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

23న సబ్‌జూనియర్ ఫుట్‌బాల్ ఎంపికలు

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని డీఎస్ఏ క్రీడా మైదానంలో ఈనెల 23వ తేదీ ఆదివారం ఉదయం 8 గంటలకు జిల్లాస్థాయి ఫుట్‌బాల్ సబ్‌జూనియర్ విభాగం బాలబాలికలకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు వైఎస్ఆర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మామిడి సుధీర్ ఒక ప్రకటనలో తెలిపారు. 01-01-2010 నుంచి 31-12-2011 మధ్య పుట్టినవారు ఈ ఎంపికలకు అర్హులన్నారు. ఎంపికలకు హాజరయ్యే వారు ఆధార్‌కార్డు, బర్త్ సర్టిఫికెట్, స్టడీ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు వెంట తీసుకురావాలని సూచించారు. పూర్తి వివరాలకు 9912020424, 99590 06388 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

రైళ్ల రాకపోకల్లో మార్పులు

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప మీదుగా నడిచే గుంటూరు-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌ను నాన్ ఇంటర్ లాంకింగ్ పనుల వల్ల తాత్కాలికంగా దూరాన్ని కుదించినట్లు కడప రైల్వేస్టేషన్ మేనేజర్ నరసింహారెడ్డి తెలిపారు. చీకటీగలపాలెం-శావల్యాపురం (వినుకొండ మండలం)ల మధ్య నాన్ ఇంటర్ లాంకింగ్ పనులు ఈనెల 31 నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు జరగనున్నాయని తెలిపారు. అందులో భాగంగా గుంటూరు-తిరుపతి (17261) రైలును ఈనెల 31 నుంచి ఆగస్టు 2వ తేది వరకు, తిరుపతి-గుంటూరు (17261)ల మధ్య నడిచే రైలును ఆగస్టు 1 నుంచి 3వ తేది వరకు తిరుపతి-మార్కాపురం మధ్య మాత్రమే నడుస్తుందన్నారు. ప్రయాణీకులు ఈ విషయాన్ని గ్రహించి వారి ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చూసుకోవాలని ఆయన తెలిపారు.

గర్భిణులకు రక్తపరీక్షలు నిర్వహించాలి

కడప రూరల్ : ప్రతి గర్భిణికి రక్త పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య సంరక్షణకు కృషి చేయాలని మదర్ అండ్ చైల్డ్ హెల్త్ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలోని మీటింగ్ హాలులో ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు హిమోగ్లోబిన్ టెస్ట్ చేసే విధానంపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ హెచ్‌బీ మీటరు ద్వారా కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు ఏ విధంగా టెస్టులు చేస్తున్నారో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి గర్భిణికి రక్తపరీక్షలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు, ఎస్‌హెచ్ఎం డీపీఎంఓ డాక్టర్ నాగశశిభూషణ్‌రెడ్డి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

'వైఎస్ఆర్ నేతన్న నేస్తం'
చేనేతలకు అభయహస్తం

- జేసీ గణేష్ కుమార్
- జిల్లాలో 9,446 మందికి లబ్ధి
- రూ. 22.67 కోట్లు జమ

కడప సెవెన్‌రోడ్స్ : రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న 'వైఎస్ఆర్ నేతన్న నేస్తం'పథకం వల్ల చేనేత కుటుంబాల్లో వెలుగులు నిండుతున్నాయని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అన్నారు. శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తిరుపతి జిల్లా వెంకటగిరి బహిరంగ సభ నుంచి బటన్ నొక్కి 'వైఎస్ఆర్ నేతన్న నేస్తం'ఐదో విడత లబ్ధి మొత్తాన్ని లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిశాక 5వ ఏడాది 'వైఎస్ఆర్ నేతన్న నేస్తం'పథకం ద్వారా జిల్లాలోని 9,446 మందికి మంజూరైన రూ.20,67,04,000ల మెగా చెక్కును అతిథులతో కలిసి జేసీ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఐదో విడత 'వైఎస్ఆర్ నేతన్న నేస్తం'పథకం ద్వారా జిల్లాలో 9,449 మంది లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో ఒక్కొక్కరికి రూ.24 వేలు చొప్పున రూ.22.67 కోట్లు అందడం సంతోషదాయకమన్నారు. రాష్ట్రంలో అర్హత ఉన్న ఏ ఒక్క నిరుపేద సంక్షేమ పథకాలకు దూరం కాకూడదనేదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా ముఖ్యమంత్రి అన్ని రకాల సంక్షేమ పథకాలను నిరంతరాయంగా కొనసాగిస్తూ వస్తున్నారన్నారు. ఏవైనా కొన్ని కారణాల వల్ల ప్రస్తుతం లబ్ధిపొందలేక పోయిన వారు స్థానిక సచివాలయాల్లో తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అర్హత ఉండి లబ్ధి చేకూరడంలో ఏమైనా సమస్యలు ఉంటే సంబంధిత శాఖ జిల్లా అధికారులను, రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక టోల్ ఫ్రీ నంబరు 1902 కు కాల్ చేసి తెలుపవచ్చన్నారు.



లబ్ధిదారులకు మెగా చెక్కును అందజేస్తున్న జేసీ గణేష్‌కుమార్, రాష్ట్ర ఉద్యాన సలహాదారుడు పి. శివప్రసాద్ రెడ్డి తదితరులు

ఆకట్టుకున్న చేనేత ఉత్పత్తుల స్టాల్స్

చేనేత సంఘాల సభ్యులు ప్రదర్శించిన చేనేత ఉత్పత్తులు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా వారు ఉత్పత్తి చేసి, అమ్మకానికి సిద్ధంగా ఉన్న పలురకాల సంప్రదాయ నూలు, పట్టు వస్త్రాలను పరిశీలించిన జేసీ చేనేత ఉత్పత్తిదారులను అభినందించారు. మగ్గంపై కూర్చుని వస్త్రాలను ఎలా తయారు చేస్తారో వారిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యాన సలహాదారులు పి. శివప్రసాద్ రెడ్డి, చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు వి.హరికృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

మా తలరాతలు మారాయి



సీఎం జగనన్న వైఎస్సార్ నేతన్న నేస్తం పథకం ద్వారా ఏటా రూ.24 వేలు అందుకోవడం మహా భాగ్యంగా భావిస్తున్నాం. గతంలో మగ్గం నేయక పోతే కుటుంబం గడవని పరిస్థితి మాది. గడిచిన పదేళ్లలో చాలా ఇబ్బందులు పడ్డాం. వరుసగా ఐదో ఏడాది రూ. 24 వేల నేతన్న నేస్తం ఆర్థిక సహాయంతోపాటు.. అమ్మఒడి, ఇతర ప్రభుత్వ పథకాల ద్వారా మా కుటుంబం ఆర్థికంగా ఏ ఇబ్బందులు లేకుండా నిలదొక్కుకుంది. - బి.రఘు శేఖర్, ప్రొద్దుటూరు

తలెత్తుకుని జీవిస్తున్నాం



ఇంతకాలం మగ్గం చెడిపోతే తయారీకి అప్పులు చేయాల్సి వచ్చేది. ఈ పథకం ద్వారా ప్రభుత్వం ఇస్తున్న ఆర్థిక సాయంతో మగ్గాల మరమ్మతులతోపాటు కొత్త డిజైన్లు వేసుకొని మెరుగైన ఉపాధి పొందుతున్నాం. వైఎస్సార్ 'నేతన్న నేస్తం పథకం'మా లాంటి పేద బతుకులకు ఎంతో ఊరట నిస్తోంది. ఈ పథకం నేత కార్మికులమంతా తలెత్తుకుని గౌరవంగా జీవిస్తున్నాం. - బి.సుబ్రమణ్యం, ప్రొద్దుటూరు

ముఖ్యమంత్రికి ధన్యవాదాలు



'వైఎస్సార్ నేతన్న నేస్తం'పథకం ద్వారా ప్రభుత్వం అందజేసే రూ. 24 వేలు ఆర్థిక సాయంతో మా జీవితాలు మెరుగు పడుతున్నాయి. రోజంతా మగ్గం నేస్తే వచ్చిన సంపాదన ఇంటి ఖర్చులు, పిల్లల చదువులకే సరిపోతోయేది. చేనేతల పక్షాన అండగా నిలిచిన సీఎం జగనన్నకు ధన్యవాదాలు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇతర పథకాలు కూడా మా కుటుంబానికి అందుతున్నాయి. - లక్ష్మీదేవి, రామనపల్లె, చెన్నూరు మండలం

ఆదుకున్న ప్రభుత్వం



'వైఎస్ఆర్ నేతన్న నేస్తం'పథకం మాలాంటి వారికి ఎంతో సాయపడింది. దశాబ్దాలుగా మా కుటుంబం.. చేనేత వస్త్రాలు నేస్తూ జీవనం సాగిస్తోంది. అమ్మకాలు ఒకసారి ఆశాజనకంగా ఉంటే.. మరోసారి దివాళా తీసే పరిస్థితులు. కుటుంబ పోషణకే కష్టతరంగా సాగిన రోజులు గడిపాం. అలాంటి సమయంలో ప్రభుత్వం మమ్మల్ని ఆదుకుంది. జగనన్న నేత కార్మికుల పాలిట దేవుడయ్యారు. - విజయలక్ష్మి, రామనపల్లె, చెన్నూరు మండలం

జిల్లాలో వర్షం



కడప అగ్రికల్చర్: గత కొద్ది రోజులుగా వర్షం కోసం రైతన్నలు ఎదురు చూస్తున్నారు. గురువారం రాత్రి పొద్దుపోయాక జిల్లావ్యాప్తంగా పలు మండలాలల్లో మోస్తరు వర్షం కురిసింది. ఇందులో సిద్దవటంలో అత్యధికంగా 15.2, చాపాడులో అత్యల్పంగా 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో వాతావరణం చల్లబడింది. ఇదే వర్షం మరో మూడు నాలుగు రోజులు కురిస్తే పచ్చిరొట్ట విత్తనాలను సాగు చేసుకునే అవకాశం ఉంటుంది.

మండలం కురిసిన వర్షం(మి.మీ)

సిద్దవటం	:15.2	కమలాపురం	: 10.4
సింహాద్రిపురం	:12.4	వల్లూరు	: 9.8
చెన్నూరు	:12.0	బి.మఠం	: 8.8
పెద్దముడియం	:11.4	లింగాల	: 8.8
ఖాజీపేట	:10.8	కడప	: 8.2

నేడు ప్రత్యేక లోక్ అదాలత్



కడప అర్బన్: జాతీయ న్యాయ సేవాధికారసంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆదేశానుసారం జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఈనెల 22న (శనివారం) ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్నారు.ఇందులో మోటార్ వాహనాల ప్రమాదాలు, భూసేకరణకు సంబంధించిన కేసులను మాత్రమే రాజీ చేసుకోవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 08562 - 258622, 244622 నంబర్లలో సంప్రదించాలన్నారు.లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. అన్నపూర్ణ, డీఎల్ఎస్ఏ సెక్రటరీ, జడ్జి ఎం. ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు అభివృద్ధికి సహకరించండి

మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డికి ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి వినతి

కడప అగ్రికల్చర్: రాష్ట్రంలోని ఆప్కాబ్, డీసీసీ బ్యాంకుల అభివృద్ధికి టీటీడీ లాంటి సంస్థల డిపాజిట్లను జమచేసి సహాయ సహకారాలు అందించాలని, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని ఆప్కాబ్, డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి కోరారు. శుక్రవారం కడపకు వచ్చిన మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి, డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్‌లు మర్యాద పూర్వకంగా కలిశారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా డీసీసీ బ్యాంకు చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆప్కాబ్, డీసీసీబీలలో ప్రభుత్వ, టీటీడీ లాంటి సంస్థల డిపాజిట్లు జమచేయడానికి సహాయం చేయాలన్నారు. అలాగే సొసైటీల్లో సిబ్బంది కొరత ఉందని, నియామకాలను చేపట్టాలన్నారు. సొసైటీ ప్రెసిడెంట్లకు రూ. 1250 మాత్రమే గౌరవ వేతనం చెల్లిస్తున్నామని,దీనిని వీలైనంత మేరకు పెంచాలని కోరారు. 2104కు ముందు పదవీ విరమణ పొందిన డీసీసీ బ్యాంకు ఉద్యోగులకు కనీస పెన్షన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీనికి స్పందించిన మంత్రి త్వరలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆప్కాబ్, డీసీసీబీ బ్రాండ్ ఇమేజ్ పెంచుకోవాలని, కమర్షియల్ బ్యాంకులకు దీటుగా పని చేయాలని, రైతులకు, బడుగు బలహీన వర్గాలకు సహాయం చేయడంలో ముందుండాలని రాజేంద్ర కుమార్‌కు మంత్రి సూచించారు.



మంత్రి కాకానితో చర్చిస్తున్న మల్లెల ఝాన్సీరాణి

నిర్వాసితుల సమస్యలు పరిష్కరిస్తాం

జేసీ గణేష్‌కుమార్

కొండాపురం: గండికోట జలాశయం ముంపు నిర్వాసితుల సమస్యలను పరిస్కారిస్తామని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని నేదరపేట పునరావాస కేంద్రాన్ని జమ్మలమడుగు ఆర్డీఓ శ్రీనివాసులుతో కలిసి పరిశీలించారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో ఉన్న సమస్యలను నిర్వాసితులు జాయింట్ కలెక్టర్ దృష్టి తీసుకెళ్లారు. ఇక్కడ రూ. 52 లక్షలతో నిర్మించిన 60 వేల లీటర్ల మంచి నీటి ట్యాంకును జేసీ పరిశీలించారు. అనంతరం ఓబన్నపేట పునరావాస కాలనీలో డ్రైనేజీలను పరిశీలించారు ఈకార్యక్రమంలో డీటీ మీనా, మండల సర్వేయర్ డీటీ రాజేశ్వరి, ఇన్‌చార్జి ఆర్ ఐ ఆనంద్ ఆర్‌డబ్ల్యూఎస్ ఎఈ ప్రసాద్ , గ్రామ సర్పంచ్ కుమ్మెత సుశీలమ్మ, జలవనరులశాఖ అధికారులు పాల్గొన్నారు.



కొండాపురం: గండికోట ముంపు నిర్వాసితులతో మాట్లాడుతున్న జేసీ గణేష్‌కుమార్

వ్యవసాయరంగం లాభాల బాటలో సాగాలి

కడప సెవెన్‌రోడ్స్: వ్యవసాయ, అనుబంధ రంగాలను లాభాల బాటలో నడిపించి రైతులను ఆర్థికంగా బలోపేతం చేయాలని జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లో రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ పి. శివ ప్రసాద్ రెడ్డి అధ్యక్షతన వ్యవసాయ సలహా మండలి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జేసీ గణేష్ కుమార్ తోపాటు రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారుదారు ఇరగంరెడ్డి తిరుపాల్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జేసీ మాట్లాడుతూ రైతులు లాభాల బాటలో నడిచేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ఆర్బీకేల ద్వారా సేవలు అందించాలన్నారు. జిల్లాలో రాగి, జొన్న, కంది పంటల సాగు విస్తీర్ణాన్ని పెంపొందించాలని, ఆ దిశగా వ్యవసాయ శాఖ డివిజన్ల వారీగా టార్గెట్లు ఇవ్వాలన్నారు. రాష్ట్ర ఉద్యాన సలహాదారు, జిల్లా వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ పి. శివప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఈ సీజన్లో పశువులకు గాలికుంటు వ్యాధి అధికంగా సోకే అవకాశాలు ఉన్నాయని, అందుకు ముందస్తుగా నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం సెరికల్చర్‌శాఖ రూపొందించిన పట్టు పరిశ్రమ నిర్వహణలో యాజమాన్య పద్ధతులు, అవగాహన అంశాలతో కూడిన పోస్టర్లను జేసీ, బోర్డు సభ్యులు, సంబంధిత అధికారులతో కలిసి జేసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నాగేశ్వరరావు, ఏపీఎంఐపీ పీడీ రవీంద్రరెడ్డి, సీఎంఎస్ఎఫ్ (ప్రకృతి వ్యవసాయం) డీపీఎం రామకృష్ణ, ఆత్మ పీడీ విజయ కుమారి, డీసిఓ సుభాషిణి, ఎల్డీఎం దుర్గాప్రసాద్, పట్టు పరిశ్రమ శాఖ ఏడీ శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంజనీరింగ్‌లో కోర్సు ఎంపికే కీలకం

- ఈ నెల 24 నుంచి ఈఏపీ సెట్ కౌన్సెలింగ్
- ఇంజనీరింగ్, వ్యవసాయ కోర్సులకు షెడ్యూల్ విడుదల

కడప ఎడ్యుకేషన్: ఇంజినీరింగ్, అగ్రికల్చర్ కళాశాలల్లో చేరికకు హడావుడి మొదలైంది. ప్రవేశాలకు సంబంధించి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను విడుదల చేసింది. షెడ్యూల్‌ను ఆగస్టు 14వ తేదీ నాటికి పూర్తి చేసి 16వ తేదీ నుంచి తరగతుల నిర్వహణకు చర్యలు చేపట్టనుంది.

24 నుంచి ఎంపిక ప్రక్రియ..

ఈఏపీ సెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ఈనెల 24 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ర్యాంకులను బట్టి ఏ కోర్సు ఎంపిక చేసుకోవాలి.. ఏ కళాశాల చేరాలో వంటి అంశాలపై విద్యార్థులు అవగాహనకు వచ్చి ఉంటారు. వైఎస్సార్ జిల్లాలో 16 ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా ఇందులో 6615 సీట్లు అందుబాటులో ఉన్నాయి. జేఎన్‌టీయూ పరిధిలో ఒక ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ఉండగా అందులో 300 సీట్లు, కడప వైవీయూ యూనివర్సిటీ పరిధిలో ఓ గవర్నమెంట్ ఇంజినీరింగ్ కళాశాల ఉండగా అందులో 253 సీట్లు అందుబాటులో ఉన్నాయి.

ఈఏపీ సెట్‌లో 14,303 మంది క్వాలిఫై

జిల్లాలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి ఏపీ ఇంజినీరింగ్, అగ్రికల్చర్ ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ పరీక్ష(ఏపీఈఏపీసెట్)-2023 ఫలితాలు ఇటీవలే విడుదలయాయి. ఇందులో అగ్రికల్చర్, ఫార్మసీకి సంబంధించి జిల్లాలో 5,958 మంది ప్రవేశ పరీక్షరాయగా 5,192 మంది క్వాలిఫై అయ్యారు. ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి 12,746 మంది ప్రవేశ పరీక్ష రాయగా 9,111 మంది క్వాలిఫై అయ్యారు. జిల్లాలో ఉండే ప్రైవేటు, ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలకు సంబంధించి 7,168 మంది విద్యార్థులకు మాత్రమే అవకాశం ఉంది. జిల్లాలో ఇప్పటికే చాలామంది ఇంజినీరింగ్ విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లిపోగా కొందరు ఐఐటీ,ఎన్ఐటీ వంటి జాతీయస్థాయి ఇంజి నీరింగ్ కోర్సుల్లో చేరిపోయారు.



హెల్ప్‌లైన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన ప్రొద్దుటూరులోని వైవీయూ ఇంజనీరింగ్ కళాశాల

కొత్త బ్రాంచులు అందుబాటులోకి..

జిల్లాలో ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో సీఎస్‌సీ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ వంటి రెగ్యులర్ కోర్సులతోపాటు కొన్ని కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. సీఎస్ఈలో ఏఐ, మెషిన్ లర్నింగ్, సైన్స్ రోబోటిక్స్, సైబర్ సెక్యూరిటీ, ఏరోస్పేస్, మెరైన్ , మైనింగ్ వంటి కొత్త బ్రాంచులు అందుబాటులో ఉన్నాయి.

జిల్లాలో రెండు హెల్ప్‌లైన్ కేంద్రాలు

జిల్లాలో కడపలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, పొద్దుటూరు వైస్సార్ ఇంజనీరింగ్ కళాశాలలను హెల్ప్‌లైన్ కేంద్రాలుగా ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో అభ్యర్థులకు ఏదైనా సాంకేతిక సమస్య తలెత్తితే హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లి సరిచేసుకునే వెసులుబాటు ఉంటుంది.

ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ఇలా..

- cets.apsche.ap.gov.in వెబ్‌సైట్‌లో ఈఏపీ సెట్-23 అడ్మిషన్‌పై క్లిక్ చేయాలి.
- హాల్‌టికెట్, పుట్టిన తేదీతో రిజిస్ట్రేషన్ ఫారంలోకి ప్రవేశించాలి. సమాచారం నింపి సబ్‌మిట్ కొట్టాలి.
- 10వ తరగతి , ఇంటర్మీడియట్ మార్కుల జాబితా, 6 నుంచి ఇంటర్ వరకు స్టడీ, టీసీ, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ, ర్యాంకు కార్డు, హాల్‌టికెట్, రేషన్ కార్డు జిరాక్స్ అప్‌లోడ్ చేయాలి.
- గత ఏడాది నుంచి ఈడబ్ల్యూఎస్ కుల ధృవీకరణ పత్రం గలవారికి 10 శాతం రిజిస్ట్రేషన్ అమలు చేస్తున్నారు.
- ఈ నెల 24 నుంచి ఆగస్టు 3 వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు
- ఇందులో వెబ్ కౌన్సెలింగ్‌కు సంబంధించి ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ. 1200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు రూ. 600 ఫీజును ఆన్‌లైన్‌లో క్రెడిట్‌కార్డు లేదా డెబిట్ కార్డు, నెట్ బ్యాంకు ద్వారా ఫీజును చెల్లించాలి.
- ఈ నెల 25 నుంచి ఆగస్టు 4 వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుంది.
- ఆగస్టు 3 నుంచి 8వ తేదీ వరకు వెబ్ ఆప్షన్ల ఎంపిక, 9న వెబ్ ఆప్షన్లు మార్పునకు అవకాశం
- 12వ తేదీన సీట్ల కేటాయింపు, 13,14 తేదీల్లో రిపోర్టింగ్
- ఆగస్టు 16వ తేదీ నుంచి ఇంజినీరింగ్ తరగతులు ప్రారంభం

జాగ్రత్తలు పాటించాలి



ఈఏపీ సెట్‌లో ర్యాంకు సాధించిన అభ్యర్థులు రిజిస్ట్రేషన్ నుంచి ఆన్‌లైన్ ఫీజ చెల్లింపు, కళాశాల, కోర్సు ఎంపిక స్వయంగా చూసుకోవాలి. స్నేహితులు, మరొకరి సహకారంతో ఆన్‌లైన్ ద్వారా ఎంపిక చేస్తే తప్పులు జరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల మీరే స్వయంగా వెళ్లి ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకోవాలి. ఇందుకు సంబంధించి విద్యార్థి , లేదా వారి తల్లితండ్రులకు సంబంధించిన సెల్ నంబర్‌ను మాత్రమే ఇవ్వాలి. ఎందుకంటే సమాచారం వస్తుంది. మొదటి దశే కీలకం. ర్యాంకును బట్టి మంచి కళాశాలను ఎంపిక చేసుకోవాలి. - కేవీ రమణయ్య, వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాల హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్

ఉపాధి కోర్సులను ఎంపిక చేసుకోవాలి



విద్యార్థులు కోర్సుల ఎంపిక విషయంలో ఉపాధి అవకాశాలను బట్టి కోర్సులు ఎంపిక చేసుకోవాలి. దీంతోపాటు కళాశాలను కూడా అన్ని విధాలా విచారించి ఎంపిక చేసుకోవాలి. ఆసక్తి ఉన్న బ్రాంచిని ఎంచుకుని ప్రతిభ చూపాలి. - సీహెచ్ జ్యోతి, హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్, ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల, కడప

స్టాఫ్ నర్స్ నియామక కౌన్సెలింగ్ ప్రారంభం



స్టాఫ్ నర్స్ నియామక కౌన్సెలింగ్ చేపడుతున్న మెడికల్, హెల్త్ ఆర్డీ అనిల్‌కుమార్

కడప రూరల్: కడప వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో శుక్రవారం స్థానిక నూర్జాహన్ ఫంక్షన్ హల్‌లో కాంట్రాక్ట్ స్టాఫ్ నర్స్‌ల నియామక కౌన్సెలింగ్ జరిగింది. గత అనుభవాల దృష్ట్యా అభ్యర్థుల దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించారు. మొత్తం 313 పోస్టుల భర్తీకి గాను మొదటి రోజు 177 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి నియామక పత్రాలను అందజేశారు. మిగిలిన అభ్యర్థులకు శనివారం కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రభు త్వం వైద్య ఆరోగ్య శాఖలో నియామకాలు చేపడుతోందన్నారు. స్టాఫ్ నర్స్‌లుగా నియమితులైన వారు వైద్య సేవల ను అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యాలయ డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెంట్‌లు గోపాల్‌రెడ్డి, వెంకటసుబ్బమ్మ సీనియర్ అసిస్టెంట్స్ అల్లావుల్లా, వినీష రాయలసీమ జిల్లాల నుంచి వచ్చిన అభ్యర్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దాడికేసులో ఏడాది జైలు, రూ.10 వేల జరిమానా

కమలాపురం : మండలంలోని పందిళ్లపల్లెకు చెందిన షేక్ మస్తాన్ అదే గ్రామానికి చెందిన బోగాదిపై దాడి చేసిన కేసులో కోర్టు ఏడాది జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య శుక్రవారం తెలిపారు. 2017లో మస్తాన్ బోగాదితో గొడవపడి దాడి చేశాడు. బోగాది ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదైంది. కేసు పూర్వాపరాలు పరిశీలించిన ప్రొద్దుటూరు సబ్ కోర్టు జడ్జి శివ ప్రసాద్ యాదవ్ శుక్రవారం నిందితుడికి ఏడాది జైలు శిక్షతో పాటు రూ.10వేల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

గాయపడ్డ బాలుడి మృతి



కేశవ (ఫైల్)

కమలాపురం : కమలాపురం పట్టణం రాంనగర్‌కు చెందిన ధన్యాసి కేశవ(5) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. రామ్ నగర్‌కు చెందిన సర్ఫరాజ్, శశికళ దంపతుల మూడో సంతానం కేశవ బుధవారం సాయంత్రం వీధిలో ఆడుకుంటుండగా బైక్ ఢీకొంది. ఈ ఘటనలో గాయపడ్డ బాలుడిని తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం బాలుడిని కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి కేశవ మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

యువకుడి ఆత్మహత్య



నరేంద్ర(ఫైల్)

పులివెందుల రూరల్ : పట్టణంలోని కరెంటు ఆఫీస్ సమీప మెయిన్ రోడ్డులోని ఓ ఇంట్లో నివాసముంటున్న నాగరాజు, సుజాతల కుమారుడు నరేంద్ర (20) అనే యువకుడు శుక్రవారం మధ్యాహ్నం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. నాగరాజు, సుజాత పట్టణంలో కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. వీరికి కుమారుడు నరేంద్ర, కుమార్తె ఉన్నారు. నరేంద్ర ఇంటర్ వరకు చదివి ఇంటి దగ్గరే ఖాళీగా ఉంటున్నాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో నరేంద్ర ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతి గల కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు తెలిపారు. నరేంద్ర తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

వైభవంగా ముగిసిన
బలిజపల్లె గంగమ్మ జాతర

- ఊరేగింపుగా అమ్మవారిని పొలిమేర్లకు తరలింపు
- ఎదురు గుంభాలతో గంగమ్మను సాగనంపిన భక్తులు



గంగమ్మను ఊరేగింపుగా పొలిమేర్లకు తీసుకెళుతున్న భక్తులు

రాజంపేట టౌన్ : పట్టణ పరిధిలోని బలిజపల్లె గ్రామంలో గంగమ్మ జాతర వేడుకలు ఘనంగా ముగిశాయి. బుధవారం రాత్రి ప్రారంభమైన అమ్మవారి జాతర శుక్రవారం తెల్లవారుజామున ముగిసింది. భక్తులు అమ్మవారిని చేతులమీద ఊరేగిస్తూ వెళ్లి పొలిమేర్లకు సాగనంపారు. అమ్మవారిని ఊరేగించేందుకు భక్తులు పోటీపడ్డారు. ఊరేగింపు సందర్భంగా భక్తులు గంగమ్మకు అడుగడుగునా ఇష్టమైన నైవేద్యాలు సమర్పించారు. ఆసాదులు దారి పొడవునా అమ్మవారికి దీవెనలు ఇచ్చారు. ఈసందర్భంగా ఆసాదులు ప్రజా ప్రతినిధులు, పట్టణ ప్రముఖుల పేర్లను జోడించి కథలు చెప్పడం అందరినీ ఆకట్టుకుంది. ఆసాదులు చెప్పే కథ వినేందుకు భక్తులు ఆసక్తి చూపారు. జాతర వేడుక చివరి ఘట్టాన్ని తిలకించేందుకు పట్టణంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు.జాతరలో దాదాపు లక్ష మందికి పైగా భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నట్లు అధికారులు,నిర్వాహకులు అంచనా వేస్తున్నారు. జాతర ప్రారంభమైనప్పటి నుంచి గురువారం అర్ధరాత్రి వరకు జాతరలో భక్తుల రద్దీ కొనసాగింది.

కోటిన్నరకు పైగా వ్యాపారం

ఈ ఏడాది జాతర ఆలస్యంగా జరిపినా గతంలో ఎన్నడూ లేని విధంగా భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. వేలాది మంది భక్తులు జాతరలో అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. జనం భారీగా రావడంతో అన్ని రకాల వ్యాపారాలు జోరుగా సాగాయి. ముఖ్యంగా వందలాది మంది భక్తులు అమ్మవారికి పొట్టేళ్ళు, మేకపోతులు, కోడిపుంజులను సమర్పించారు. అలాగే జాతర రోజున దాదాపు భక్తులంతా మటన్, చికెన్ వంటివి కొనుగోలు చేశారు. జాతరలో సింహభాగం వ్యాపారం మాంసాహారాలకు సంబంధించి జరిగినట్లు వ్యాపారులు అంచనా వేస్తున్నారు.

పోలీసుల విశేష కృషి

గత ఏడాది జాతర అంకురార్పణ సందర్భంగా చోటు చేసుకున్న ఘర్షణలు వంటి పరిణామాలను దృష్టిలో ఉంచుకొని డీఎస్పీ వీఎస్‌కే చైతన్య జాతర బందోబస్తుపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. అర్బన్, రూరల్ సీఐలు నరసింహారావు, పుల్లయ్య, పట్టణ, రూరల్ ఎస్ఐలు ప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, భక్తవత్సలం జాతరను ప్రశాంత వాతావరణంలో జరిపించడానికి తమ వంతు విశేష కృషి చేశారు. జాతరలో పలువురు పిల్లలు తప్పిపోయారు. విషయాన్ని పిల్లల తల్లిదండ్రులు పోలీసులకు తెలియచేయగానే పోలీసులు మైక్ ద్వారా అనౌన్స్ చేసి తప్పిపోయిన పిల్లలను వారి తల్లిదండ్రులకు అప్పగిస్తూ వచ్చారు.

చిత్తూరు జట్టు ఘన విజయం

- అనంతపురం–కర్నూలు మ్యాచ్ డ్రా
- డబుల్ సెంచరీ సాధించిన సాయిసూర్యతేజారెడ్డి



తలపడుతున్న అనంతపురం, కర్నూలు జట్లు (ఇన్‌సెట్) డబుల్ సెంచరీ చేసిన కర్నూలు బ్యాట్స్‌మెన్ సాయిసూర్యతేజారెడ్డి

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ సౌత్‌జోన్ అంతర్ జిల్లాల అండర్–19 మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్‌లో చిత్తూరు జట్టు ఘన విజయం సాధించింది. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో మూడోరోజు శుక్రవారం 144 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన చిత్తూరు జట్టు 57.4 ఓవర్లలో 8 వికెట్ల వద్ద 206 పరుగుల వద్ద సెకండ్ ఇన్నింగ్స్ డిక్లేర్ చేసింది. జట్టులోని మహమ్మద్ ఇర్ఫాన్ 56, భవానీప్రసాద్ 46, రెడ్డిరుషీల్ 48 పరుగులు చేశారు. నెల్లూరు బౌలర్ భార్గవ్ మహేష్ 4 వికెట్లు తీశాడు. అనంతరం సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 45 ఓవర్లలో 163 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సుతేజ్‌రెడ్డి 53 పరుగులు చేశాడు. చిత్తూరు బౌలర్ రాజ్‌దీప్ జతిన్ 6 వికెట్లు తీశాడు. దీంతో చిత్తూరు జట్టు 132 పరుగుల తేడాతో విజయం సాధించింది. కాగా చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 341 పరుగులు చేయగా, నెల్లూరు జట్టు 252 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

అనంతపురం జట్టు ఫస్ట్ ఇన్నింగ్స్ ఆధిక్యం

వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ మైదానంలో జరిగిన అనంతపురం, కర్నూలు మ్యాచ్ డ్రాగా ముగిసింది. 148 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కర్నూలు జట్టు 110.4 ఓవర్లలో 388 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. కెప్టెన్ సాయిసూర్యతేజారెడ్డి 274 బంతుల్లో 28 ఫోర్లు, 6 సిక్సర్‌లతో 218 పరుగులు చేశాడు. అనంత బౌలర్ లోహిత్‌సాయికిశోర్ 4 వికెట్లు తీశాడు. అనంతరం సెకండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 14 ఓవర్లలో వికెట్ నష్టానికి 93 పరుగులు చేసింది. అర్జున్ టెండూల్కర్ 58 పరుగులు చేశాడు. ఫలితం తేలకపోవడంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. కాగా తొలి ఇన్నింగ్స్‌లో అనంతపురం జట్టు 321 పరుగులు చేయగా, కర్నూలు జట్టు 175 పరుగులు చేసిన సంగతి తెలిసిందే.

వైవీయూ క్యాంపస్ డ్రైవ్‌లో 42 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో వీసీ, అధ్యాపకులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జాబ్‌డ్రైవ్‌లో 42 మందికి ఉద్యోగాలు లభించినట్లు వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ తెలిపారు. శుక్రవారం వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్, హైదరాబాద్ హెటిరో ల్యాబ్ అన్‌లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాంపస్ ఎంపికలకు వీసీ ముఖ్య అతిథిగా విచ్చేసి ఉద్యోగాలకు ఎంపికైన వారికి నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వీసీ ఏడాదికి రూ. 3లక్షల వేతనంతో జూనియర్ ఎగ్జిక్యూటివ్‌గా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ ఎల్.వి. రెడ్డి మాట్లాడుతూ హెటిరో డ్రగ్స్ అసిస్టెంట్ మేనేజర్ సత్యనారాయణ, క్యూసీ మేనేజర్ రామాంజనేయులు, ప్రొడక్షన్ మేనేజర్ వి. రామిరెడ్డి, హెచ్ఆర్ మేనేజర్ సీయోనుల ఆధ్వర్యంలో ఎంపికల ప్రక్రియ నిర్వహించినట్లు తెలిపారు. ఈ ఎంపికల్లో 33 మంది కెమిస్ట్రీ విద్యార్థులు, 15 మంది విద్యార్థులు మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ శాఖల నుంచి ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఆచార్య ఏజీ దాము, డా. అమృత్‌ప్రసాద్‌రెడ్డి, డా. మెర్సీ విజేత, డా. మాధవరెడ్డి, డా. ఎల్. సుబ్రమణ్యం, డా. వసుగోవర్ధన్‌రెడ్డి, డా.ఎల్. దాక్షాయణి తదితరులు పాల్గొన్నారు.

ఆగిఉన్న టిప్పర్‌ను ఢీకొన్న ఆటో





గాయపడ్డ వెంకటచలమారెడ్డి, చంద్రారెడ్డి, కుళ్లాయమ్మ

8మందికి గాయాలు

పులివెందుల రూరల్/వేముల : పులివెందుల నియోజకవర్గం వేముల మండలం వేల్పుల గ్రామ సమీపంలో శుక్రవారం రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్‌ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు కాగా, మరో ఆరుగురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పులివెందుల నుంచి ప్యాసింజర్ ఆటో ప్రయాణికులను ఎక్కించుకుని వేంపల్లెకు వెళ్తూ వేల్పుల సమీపంలో రోడ్డుపై ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో పులివెందుల నుంచి సొంత గ్రామాలకు వెళుతున్న వేముల, చాగలేరు గ్రామాలకు చెందిన చంద్రారెడ్డి, ఫాతిమా, రాజేశ్వరి, వెంకట చలమారెడ్డి, కుళ్లాయమ్మ, నాగలక్ష్మి, అంజనమ్మలతోపాటు తేజస్విని అనే విద్యార్థికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం పులివెందుల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వెంకట చలమారెడ్డి, చంద్రారెడ్డిల పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని స్కూటరిస్ట్ దుర్మరణం



నాగేశ్వరరెడ్డి (ఫైల్)

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు–ప్రొద్దుటూరు రహదారిలో బైపాస్ రోడ్డు సమీపంలో కారు ఢీకొని ముడిమేల నాగేశ్వరరెడ్డి (35) అనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి చెందాడు. స్థానికుల కథనం మేరకు.. పెద్దముడియం మండలం ఉలవపల్లెకు చెందిన ముడిమేల నాగేశ్వరరెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఇతడికి భార్య ఉమాదేవి, ఇద్దరు కుమారులు ఉన్నారు. డెంటిస్ట్ అయిన ఉమాదేవి ఓ ఆస్పత్రిని నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం నాగేశ్వరరెడ్డి ప్రొద్దుటూరులో కాపురం ఉంటూ వర్క్ ఫ్రమ్ హోంలో భాగంగా ఇంటివద్ద నుంచే విధులు నిర్వహిస్తున్నాడు.నాగేశ్వరరెడ్డి శుక్రవారం సొంత పనులపై జమ్మలమడుగుకు వచ్చి తిరిగి ప్రొద్దుటూరుకు బయలుదేరాడు. నాగేశ్వరరెడ్డి మార్గమధ్యలో మూత్ర విసర్జన కోసం వాహనాన్ని ఆపగా, జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరుకు వెళుతున్న కారు వెనుక వైపు నుంచి ఢీకొంది ఈ సంఘటనలో నాగేశ్వరరెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డి ఆసుపత్రికి వచ్చి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన అన్వర్

ప్రొద్దుటూరు క్రైం : పట్టణంలోని జమ్మలమడుగు బైపాస్ రోడ్డు సమీపంలో కోట్ల అన్వర్ (43) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నంద్యాలలోని జగజ్జనని నగర్‌కు చెందిన అన్వర్‌కు భార్య షబానా, కుమారుడు, కుమార్తె ఉన్నారు. అన్వర్ కొన్ని నెలల నుంచి ప్రొద్దుటూరులోని జమ్మలమడుగు బైపాస్ రోడ్డులో ఉన్న ఖాజా అనే వ్యక్తికి చెందిన ఇనుప గోలాల తయారీ కేంద్రంలో పని చేస్తున్నాడు. రాత్రి సమయంలో అక్కడే ఒక గదిలో నిద్రించేవాడు.గురువారం రాత్రి అతడు సమీపంలోని ఈద్గా మైదానంలో నిద్రించాడు. రాత్రి పొద్దుపోయాక యజమాని ఖాజా వచ్చి చూడగా అన్వర్ తలకు దెబ్బ తగిలి చనిపోయి ఉన్నాడు. వెంటనే విషయాన్ని అతడు కుటుంబసభ్యులకు తెలిపాడు. అన్వర్ భార్య షబానా ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు.

పూడ్చిన మృతదేహానికి 3 నెలల తర్వాత పోస్టుమార్టం

కురబలకోట : ప్రమాదంలో చనిపోయిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజినీరు మృతదేహానికి 3 నెలల 10 రోజుల తర్వాత పోస్టుమార్టం నిర్వహించిన సంఘటన కురబలకోట మండలంలో శుక్రవారం జరిగింది. పిచ్చలవాండ్లపల్లె పంచాయతీ పందివానిపెంటకు చెందిన రేపన చౌడప్ప (33) బెంగళూరులోని విప్రో కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేసేవాడు. ఇతడికి భార్య శిల్ప, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 11న చౌడప్ప బెంగళూరు నుంచి బైక్‌పై ఇంటికి వస్తూ మదనపల్లె రూరల్ మండలం చీకలబైలు వద్ద జరిగిన ప్రమాదంలో చనిపోయాడు. కుటుంబీకులు విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లకుండా పోస్టుమార్టం చేయకుండానే స్వగ్రామం పందివానిపెంటలో మరుసటి రోజు అంత్యక్రియలు నిర్వహించారు. అయితే చౌడప్ప సాఫ్ట్‌వేర్ ఇంజినీరు కావడంతో అతడి మృతి తర్వాత అందించే బెనిఫిట్స్ కోసం కంపెనీ పోస్టుమార్టం సర్టిఫికెట్ కావాలని కోరింది. చౌడప్ప భార్య శిల్ప స్పందన కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎస్పీ గంగాధరరావును కలసి తన భర్త చౌడప్ప మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి సర్టిఫికెట్ ఇప్పించాలని కోరింది. ఆయన ఆదేశాలతో శుక్రవారం మదనపల్లె డీఎస్పీ కేశప్ప ఆధ్వర్యంలో సీఐ సత్యనారాయణ, తహసీల్దారు ఎం. భీమేశ్వరరావు పర్యవేక్షణలో సమాధిని తొలగించి మృతదేహాన్ని బయటకు తీయించారు. అక్కడే వైద్యులు పోస్టుమార్టం చేశారు. దానిని వీడియోలో చిత్రీకరించారు. 3 నెలల తర్వాత మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిస్తున్నారని తెలిసి పరిసర ప్రాంతాల ప్రజలు అక్కడికి పెద్ద సంఖ్యలో వచ్చారు.

బాలిక అదృశ్యంపై కేసు

సిద్దవటం : మండలంలోని మాచుపల్లె పంచాయతీ పరిధి తురకపల్లె గ్రామానికి చెందిన షేక్ రజీనా(17) అనే బాలిక కనిపించకపోవడంతో శుక్రవారం అదృశ్యం కేసు నమోదు చేశామని ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఈనెల 19వ తేదీన రజీనా ఇంటి వద్ద నుంచి కనిపించకుండా పోయిందని, వెతికినా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం బాలిక తండ్రి షేక్ సయ్యద్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గంజాయి విక్రయం కేసులో మరో వ్యక్తి అరెస్టు

ముద్దనూరు : మండలంలోని తిమ్మాపురం గ్రామ సమీపంలో గంజాయి విక్రయం కేసులో మరో నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేసారు. కొద్దిరోజుల క్రితం రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన గంగారామ్ డాబా నిర్వహణ మాటున గంజాయి విక్రయిస్తుండగా అరెస్టు చేశారు. 3 కిలోలకు పైగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. కాగా గంజాయి విక్రయంలో రాజస్థాన్ రాష్ట్రానికి చెందిన మరో వ్యక్తి ఇరా రామ్ ప్రమేయం ఉన్నట్లు తెలుసుకుని అతడిని కూడా అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వెన్నునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామానికి చెందిన ఇచ్చుకత్తుల కమాల్ బాషా (20) తీవ్రమైన వెన్నునొప్పి భరించలేక శుక్రవారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ రాజగోపాల్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. కమాల్ బాషా బేల్దారి పని చేస్తూ జీవనం సాగించేవాడు. కొన్ని రోజులుగా అతడు తీవ్రమైన వెన్నునొప్పితో బాధపడుతున్నాడు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో కమాల్ బాషా ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు ఇంటికి వచ్చేసరికి కమాల్ బాషా ఉరికి వేలాడుతూ కనిపించాడు. తన కుమారుడు వెన్నునొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడ్డట్లు తండ్రి చాంద్ బాషా చేసిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రొద్దుటూరు జిల్లా ఆస్పత్రికి తరలించారు.

స్టీరింగ్ పట్టు.. ఉపాధి కొట్టు

- నిరుద్యోగ యువతకు అండగా ఏపీఎస్ ఆర్టీసీ
- డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ
- సుశిక్షుతులైన నిపుణులతో మెలకువలు
- ఇప్పటికే 15 బ్యాచ్‌లు పూర్తి
- త్వరలో కొత్త బ్యాచ్ ప్రారంభం



శిక్షణ పూర్తి చేసుకుని సర్టిఫికెట్లు పొందిన అభ్యర్థులతో కడప డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు (ఫైల్)


కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) అంటే ముందుగా గుర్తుకువచ్చేది సురక్షిత, సుఖవంతమైన ప్రయాణం. ఏపీఎస్‌ఆర్టీసీ ప్రయాణికుల సేవలోనే కాకుండా నిరుద్యోగ యువత బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తోంది.ఆసక్తిగల వారికి హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో శిక్షణ ఇస్తోంది. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరుద్యోగ యువత భవిష్యత్తుకు భరోసా కల్పించేందుకు ఆర్టీసీ ద్వారా డ్రైవింగ్ స్కూళ్లను ఏర్పాటు చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పార్లమెంటు నియోజకవర్గాల్లో ఆర్టీసీ హెవీ వెహికల్‌లో డ్రైవింగ్ పాఠశాలలను ప్రారంభించారు. ఇందులో భాగంగా జిల్లా కేంద్రమైన కడపలో హెవీ వెహికల్ డ్రైవింగ్ శిక్షణ స్కూలును ప్రారంభించారు. అర్హతగల యువతీ యువకులకు బ్యాచ్‌లను ఏర్పాటు చేసి డ్రైవింగ్‌లో శిక్షణ, వాహన చట్టాల గురించి అవగాహన కల్పిస్తున్నారు. 32 రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. దీనికోసం నామమాత్రపు ఫీజు నిర్ణయించారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి సర్టిఫికెట్‌తోపాటు హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ ఇప్పించి వారి జీవితానికి భరోసా కల్పిస్తున్నారు. ఇక్కడ డ్రైవింగ్ నేర్చుకుంటున్న అభ్యర్థులు భవిష్యత్తులో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో డ్రైవర్లుగా స్థిరపడేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వ రంగాల్లో అయితే ఆర్టీసీ డ్రైవింగ్ స్కూలులో శిక్షణ పొందిన వారికి ప్రాధాన్యత ఉంటుందని అధికారులు చెబుతున్నారు. కడప పార్లమెంటు నియోజకవర్గంలో 2019లో డ్రైవింగ్ శిక్షణ స్కూలును ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటివరకు 15 బ్యాచ్‌లలో దాదాపు 500 మంది వరకు శిక్షణ పొందారు.నిరుద్యోగ యువతకు భవిష్యత్తు కల్పించడం, డ్రైవింగ్‌లో మెలకువలు నేర్పించడమే శిక్షణ ముఖ్య ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం 16వ బ్యాచ్‌కు శిక్షణ ప్రారంభించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఇప్పటికే శిక్షణ పొందిన వారిలో చాలామంది డ్రైవింగ్‌ను వృత్తిగా చేసుకుని స్వయం ఉపాధి పొందుతూ కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

క్రమశిక్షణతో కూడిన శిక్షణ




హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో అభ్యర్థులకు సుశిక్షుతులైన నిపుణులతో శిక్షణ అందిస్తున్నాం. క్రమశిక్షణ, అంకితభావంతో డ్రైవింగ్‌లో మెలకువలు నేర్పిస్తున్నాం. రోజూ శిక్షణానంతరం ఒక గంటపాటు తరగతి గదిలో డ్రైవింగ్ పాఠాలు, గ్యారేజీలో ఇంజన్ విడిభాగాలపై అవగాహన కల్పిస్తున్నాం. – గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజా రవాణాధికారి, కడప

మెలకువలు నేర్చుకున్నా..




నేను డ్రైవింగ్‌పై మక్కువతో ఆర్టీసీలో హెవీ వెహికల్‌డ్రైవింగ్ శిక్షణ పొందాను. బయట అయితే కేవలం డ్రైవింగ్ మాత్రమే నేర్పుతారు. ఇక్కడ అనుభవం, సుశిక్షుతులైన శిక్షకులతో చాలా మెలకువలు, ప్రమాదాల బారిన పడకుండా ఉండేలా డ్రైవింగ్ స్కిల్స్‌ను నేర్పుతున్నారు. – ఉదయ్ సాయి, జమ్మలమడుగు

పూర్తిస్థాయిలో అవగాహన



ఆర్టీసీలో ఇచ్చే డ్రైవింగ్ శిక్షణ చాలా బాగుంది. డ్రైవింగ్‌లో మెలకువలతో పాటు బస్సు యంత్రాల విడిభాగాలు చూపడం, ఏ విధంగా డ్రైవింగ్ చేస్తే ఇంధనం ఆదా అవుతుందో చూపించడం, ఎటువంటి సమయాల్లో క్లచ్, బ్రేక్ వినియోగించాలో తదితర వాటిపై అవగాహన కల్పిస్తున్నారు. – శివ, వల్లూరు

డ్రైవింగ్ శిక్షణతో జీవితానికి భరోసా



ఆర్టీసీ హెవీ వెహికల్ డ్రైవింగ్‌లో ఇచ్చిన శిక్షణ జీవితంలో స్థిరపడేలా భరోసాను కల్పించింది. డ్రైవింగ్‌లో తారు, మట్టి, సిమెంటు, కంకరరోడ్లపై, అలాగే వర్షాకాలంలో ఏ విధంగా డ్రైవింగ్ చేయాలో క్షుణ్ణంగా నేర్పించారు. నేను నా కుటుంబాన్ని పోషించుకోగలనన్న విశ్వాసం ఏర్పడింది. – రసూల్, కడప



నిన్న మొన్నటి దాకా చెమటలు పట్టించిన ఎండలు కాస్తా ఇప్పుడు మబ్బుల వెనక దాక్కుని, వానలు కురిపిస్తున్నాయి. వానలు ఆహ్లాదంగానే ఉంటాయి. అయితే సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే వ్యాధులను కూడా వెంట మోసుకొస్తాయి. ఈ అనారోగ్యాలతో పోరాడటానికి. రోగనిరోధకశక్తి బలంగా ఉండటం చాలా ముఖ్యం. వర్షాకాలంలో వ్యాధి నిరోధక శక్తిని మరింత పెంచుకోవడానికి నిత్యం తీసుకునే ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం అవసరం. ఆ మార్పులేమిటో, ఈ సీజన్‌లో ఏ ఆహారం తీసుకుంటే మంచిదో చూద్దాం...

ఈ ఆహారం తింటే...




ముసురు పట్టినప్పుడు వేడి వేడి టీ, కాఫీలు తాగుతుంటారు. అయితే వాటికి బదులు గ్రీన్ టీ, బ్లాక్ టీ, హెర్బల్ టీ వంటివి తీసుకోవాలి. దాంతోపాటు అల్లం, మిరియాలు, తేనెతో తయారు చేసిన టీ సేవిస్తే.. ఆరోగ్యానికి చాలా మంచిది. అదేవిధంగా బజ్జీలు, పునుగులు, బోండాలకు బదులు వేడి వేడి ఉగ్గాణి, సెనగ, పెసర గుగ్గిళ్లు, చుడువా, సగ్గుబియ్యం కిచిడీ మంచిది. పుదీనా, తులసి ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరల్ గుణాలు అధికంగా ఉంటాయి కాబట్టి వీటితో కషాయం కాచుకుని తాగితే మంచిది. రాగులు, సోయాబీన్, పెసలు, మొక్కజొన్న వంటి పప్పుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకుంటే ఎలాంటి అనారోగ్య సమస్యలూ దరిచేరవు. వీటితోపాటు పోషక విలువలు ఎక్కువగా ఉండే కూరగాయలు, పండ్లు అంటే దానిమ్మ, ఆపిల్, స్ట్రాబెర్రీ, అరటి, క్యాబేజీ, క్యాలీఫ్లవర్, బచ్చలి కూర వంటివి తీసుకుంటే మంచిది.

చినుకుల్లోనూ చింత ఉండదిక



అల్లం: ఇది శరీర కణజాలాలకు పోషకాలను సమీకరించడానికి, సరఫరా చేయడానికి తోడ్పడుతుంది. ఈ రోజుల్లో జలుబు, దగ్గు వంటి సమస్యలు సర్వసాధారణం. అల్లం కఫాన్ని తగ్గిస్తుంది కాబట్టి అల్లం టీ తాగితే జలుబు, దగ్గు దూరం అవుతాయి. ఫ్లూతో పోరాడటానికి అల్లం తోడ్పడుతుంది. అల్లంలోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తినీ మెరుగుపరుస్తాయి. టీలు, సూప్‌లు, కూరల్లో అల్లాన్ని ఎక్కువ ఉపయోగిస్తే వ్యాధి నిరోధకతను పెంచుకోవచ్చు.



నేరేడు పండు... ఈ పండులో ఉండే విటమిన్ సి, యాంటీ ఆక్సిడెంట్లు, ఖనిజాలూ ఫైటోకెమికల్స్ రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తాయి. నేరేడులో క్యాలరీలు తక్కువ. వానాకాలంలో వచ్చే అతిసార, కలరా వ్యాధులతో పాటు ఇతరత్రా ఇన్ఫెక్షన్లకీ నేరేడు ఔషధంలా పనిచేస్తుంది.

తులసి... ఈ కాలంలో రోజూ తులసి ఆకులను నమలడం ద్వారా అనారోగ్యాల నుంచి రక్షణ పొందవచ్చు. ఐదు తులసి ఆకులను రాత్రంతా నీటిలో నానబెట్టి.. మరుసటి రోజు ఉదయం పరగడుపునే ఆ ఆకులు తిని.. నీటిని తాగాలి. తులసి రోగనిరోధక వ్యవస్థను బూస్ట్ చేస్తుంది.



నిమ్మ... నిమ్మరసంలో విటమిన్ సి సమృద్ధిగా ఉంటుంది. ఇది శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్‌గా పనిచేసి రోగనిరోధక శక్తిని పెంపొందిస్తుంది. అంతేకాదు, శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. ఇది ఇన్ఫెక్షన్లు, అంటువ్యాధుల నుంచి శరీరాన్ని రక్షిస్తుంది.



మిరియాలు... నల్ల మిరియాలలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో సహాయపడతాయి. జీవక్రియలను పెంచుతాయి. దగ్గు, గొంతు నొప్పి ఉన్నట్లయితే నల్ల మిరియాలను పొడి చేసి నిద్రవేళకు ముందు వేడి పాలలో కలుపుకొని తాగితే ఆరోగ్యానికి చాలా మంచిది.

పసుపు... పసుపులో యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. ఇవి శరీరాన్ని అనేక వ్యాధుల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. రోజూ రాత్రిపూట చిటికెడు పసుపు కలిపిన వేడి పాలు తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది.

వీటికి దూరంగా ఉండటం మేలు!

రోగనిరోధక శక్తిని బలోపేతం చేయాలంటే చక్కెర పదార్థాలకి దూరంగా ఉండాలి. ముఖ్యంగా ఐస్ క్రీం, కేక్, క్యాండీ, చాక్లెట్, కూల్‌డ్రింక్స్ తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి తగ్గుతుంది. అలాగే ఉప్పు ఎక్కువగా ఉండే ఆహారాలు ఆరోగ్యానికి చాలా హాని కలిగిస్తాయి. రోగనిరోధక శక్తిని బలహీనపరుస్తాయి. చాలామంది ప్యాక్ చేసిన ఆహారాలని తినడానికి ఎక్కువగా ఇష్టపడుతారు. కానీ ఇవి ఆరోగ్యానికి మంచివి కావు. అధిక ఉప్పు ఆటో ఇమ్యూన్ వ్యాధి ప్రమాదాన్ని పెంచుతుంది. అలాగే ఆల్కహాల్, ధూమపానం కూడా శరీరాన్ని బలహీనంగా మారుస్తాయి. అందుకే వీటికి వీలైనంత దూరంగా ఉంటే మేలు.



లవంగం... ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి పనిచేస్తుంది. వర్షాకాలంలో లవంగాలను తీసుకుంటే గొంతు నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు.



దాల్చిన చెక్క... అద్భుత ఔషధ గుణాలెన్నో దాగి ఉన్న దాల్చిన చెక్క మధుమేహులకు రక్తంలో చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది. రోజూ గ్లాసు పాలలో దాల్చిన చెక్క పొడి కలుపుకొని తాగితే రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అంతేకాదు, శరీరంలో ఉండే కొవ్వు శాతాన్ని తగ్గించే గుణం దీనిలో ఇమిడి ఉంది.

ఉదయాన్నే పిల్లల్ని తయారు చేసి స్కూలుకు పంపించడం పేరెంట్స్‌కు పెద్దపని. ఇంతకంటే వాళ్లను నిద్రలేపడం అతిపెద్ద టాస్క్. ఎంత లేపినా నిద్ర లేవరు. కింద స్కూల్ ఆటోనో, బస్సో వచ్చి హారన్ కొడుతుంటుంది. కానీ వీళ్లు లేవరు. వీళ్లను తొందరగా నిద్ర లేపాలంటే ఇలా ప్రయత్నించి చూడండి....

బడికి వెళ్లనని మారాం చేస్తున్నారా?



సమస్యను అర్థం చేసుకోవాలి
ముందుగా నిద్ర లేవడానికి ఏమైనా ఇబ్బంది పడుతున్నారేమో గమనించాలి. రాత్రి సరిగా పడుకున్నారా లేదా... అసలు నిద్రపట్టలేదా... ఇంకేదైనా సమస్య ఉంటే అనునయంగా అడిగి తెలుసుకోవాలి.

సరిపోయిందా లేదా?
స్కూలుకెళ్లే పిల్లలు కనీసం పదిగంటలు నిద్రపోవాలి. గేమ్స్, ఫోన్లు చూస్తూ సరిగా పడుకోరు. రోజూ ఒక నిర్దేశిత సమయాన్ని కేటాయించి వాళ్లు కచ్చితంగా పడుకునేలా చేయాలి.

ప్రేమతో లేపాలి
ఉదయం ఎంత ఉత్సాహంగా లేస్తే రోజంతా అలానే గడుస్తుంది. అందుకే పిల్లలు త్వరగా లేవకపోయినా ప్రేమగా నిద్రలేపాలి. పిల్లలకు అర్థమయ్యే ప్రేమ భాషలోనే నిద్ర లేపాలి. ఇందుకోసం వాళ్లకు నచ్చే మంచి విషయాలు, స్కూలుకు వెళ్లడం ఎంతముఖ్యమో ప్రేమతో చెప్పాలి.

ఇష్టమైన ఫుడ్
పిల్లలు ఇష్టంగా తినే ఆహారాన్ని బ్రేక్‌ఫాస్ట్‌లో ఇవ్వాలి. అది తినడం కోసం అయినా త్వరగా నిద్ర లేస్తారు. ఈ నాలుగు చిట్కాలు ప్రయత్నిస్తే మీ సమస్య తీరినట్టే.

దిండు లేకుండా పడుకోలేరా?

రాత్రిపూట నిద్రించేటప్పుడు చాలా మంది తలకింద దిండు పెట్టుకొని పడుకుంటారు. అయితే తక్కువ ఎత్తు ఉన్న దిండు ఫరవాలేదు కానీ, పెద్ద దిండు పెట్టుకోవడం వల్ల చాలా ఆరోగ్య సమస్యలు ఏర్పడుతాయి. ఇది మొదట్లో తెలియదు కానీ కొన్ని రోజులు గడిచిన తర్వాత ముందుగా మెడ నొప్పి ఎదురవుతుంది. ఈ నొప్పి దీర్ఘకాలికంగా వేధిస్తుంది. కొంతమందికి ఉదయం నిద్రలేవగానే వెన్నులో నొప్పితో బాధపడతారు. మీకు ఇలాంటి సమస్య ఎదురైతే పడుకునేటప్పుడు మీరు ఎత్తయిన దిండు ఉపయోగిస్తున్నట్లు లెక్క. దీనివల్ల వెన్నెముక వంగిపోతుంది. డిస్క్‌లలో దూరం పెరిగి వెన్నునొప్పి వస్తుంది. అందువల్ల దిండు లేకుండా నిద్రించడం అలవాటు చేసుకోవాలి.



తలలో రక్త ప్రసరణ జరగదు: ఎత్తయిన దిండు పెట్టుకొని నిద్రపోతే తలకి రక్త సరఫరా సరిగ్గా జరగదు. రాత్రిపూట చాలా గంటలు ఇలాగే ఉండటం వల్ల రక్త సరఫరా లేక జుట్టుకు సరైన పోషణ లభించదు. దీనివల్ల జుట్టు రాలే సమస్య మొదలవుతుంది. అంతేకాదు, తరచు తలనొప్పి వస్తుంది. లావుపాటి దిండు పెట్టుకొని నిద్రించడం వల్ల శరీరంలోని కొన్ని భాగాలకి రక్త సరఫరా సరిగ్గా అందక తిమ్మిర్ల సమస్యలు ఏర్పడుతాయి. అందువల్ల మెడనొప్పి ఉండకూడదంటే తక్కువ ఎత్తు ఉండే చిన్న దిండుని ఉపయోగించాలి లేదంటే మెత్తటి టవల్ లేదా పలుచటి దుప్పటిని మడత పెట్టి తలకింద పెట్టుకోవడం ఉత్తమం.

హెల్త్ టిప్స్



మందారం ఆకుల్ని నూరి షాంపూగా వాడితే జుత్తు బాగా పెరుగుతుంది. చుండ్రు నివారణలోనూ, తెల్ల వెంట్రుకల నిరోధకంలోనూ సాయమవుతుంది. కప్పు నీటిలో ఒక మందార పువ్వు వేసి మరిగించి ఆ నీళ్లను తాగితే రక్తంలో ఐరన్ పెరుగుతుంది.



కరివేపాకులో యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఓ 10 ఆకులతో పేస్ట్ తయారు చేసి మజ్జిగలో కలిపేసుకుని రోజూ తాగితే కాలేయం వ్యర్థపదార్థాల నుంచి రక్షణ పొందుతుంది. రోజూ ఓ 8 ఆకుల్ని మిరియాలతో కలిపి తింటే ముక్కులో వచ్చే అలర్జీలు తగ్గిపోతాయి.



రోజూ రెండు మూడు పుదీనా ఆకుల్ని నమిలి మింగుతుంటే జీర్ణశక్తి పెరిగి, కడుపు ఉబ్బరం, తేన్పులు తగ్గుతాయి. శ్వాసకోశాల శక్తి పెరుగుతుంది.



వేపాకు, యాంటీ సెప్టిక్‌గానూ, క్రిమి సంహారిణిగానూ బాగా పనిచేస్తుంది. వేపాకు పొడిని నీళ్లల్లో కలిపి చల్లితే ఎన్నో రకాల క్రిమి కీటకాలు దూరంగా వెళ్లిపోతాయి. వేపాకుల్ని నీటిలో వేసి మరిగించి స్ప్రే చేస్తే దోమల బెడద తప్పుతుంది. వేపాకు పొడిని పేస్ట్‌గా చేసి వాడితే పలు రకాల చర్మ సమస్యలు, మొటిమలు, ఎగ్జిమాల బాధలు తప్పుతాయి.



పసుపును పేస్ట్‌గా రోజూ ముఖానికి వాడితే, ముఖం మీద ఉండే సన్నని వెంట్రుకలు రాలిపోతాయి. అలాగే మొటిమలు, మచ్చలు కూడా మాయమవుతాయి. ఇది గొప్ప యాంటీ ఆక్సిడెంటు కాబట్టి రోజు మొత్తంలో ఒక టీ స్పూను దాకా కడుపులోకి తీసుకోవచ్చు.

సినిమా

అంతం ఆరంభమవుతుంది!


ప్రభాస్

వెండితెరపై ప్రభాస్ కల్కి అవతారం ఎత్తారు. ప్రభాస్, కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ముఖ్య తారలుగా నాగ్ అశ్విన్ దర్శకత్వంలో 'ప్రాజెక్ట్ కె' వర్కింగ్ టైటిల్‌తో ఓ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ రూపొందుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం అమెరికాలో జరుగుతున్న 'శాన్ డియాగో కామిక్ కాన్ – 2023' వేడుకలో ఈ సినిమాకు 'కల్కి 2898 ఏడీ' టైటిల్‌ను ఖరారు చేసినట్లు శుక్రవారం వెల్లడించి, గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. 'ప్రపంచాన్ని చీకటి కమ్మేసినప్పుడు ఒక శక్తి ఉద్భవిస్తుంది. అప్పుడు అంతం ఆరంభం అవుతుంది' అన్నట్లుగా ఈ వీడియోలో ఉంది. ఈ వేడుకలో కమల్‌హాసన్ మాట్లాడుతూ– ''మేం స్టోరీలు చేస్తుంటే వారు (ఆడియన్స్) మమ్మల్ని స్టార్స్ చేస్తున్నారు. 'కల్కి 2898 ఏడీ'లో పెద్ద విజన్ ఉంది. ఈ సినిమాలో భాగం కావడం గౌరవంగా ఉంది'' అన్నారు. ''ఈ సినిమాలో నాగ్ అశ్విన్ నా క్యారెక్టర్‌ను డిజైన్ చేసిన తీరు బాగా నచ్చింది. సినిమాలో స్ట్రాంగ్ ఎమోషన్స్ ఉన్నాయి'' అన్నారు ప్రభాస్. ''ఈ సినిమా నాకో అద్భుతమైన అనుభవం. దీని వెనక గొప్ప పరిశోధన ఉంది'' అని వర్చ్యువల్‌గా అమితాబ్ బచ్చన్ మాట్లాడారు. ''నేను సైన్స్ ఫిక్షన్, పురాణాలను ఇష్టపడతాను. మహాభారతం, స్టార్ వార్స్... రెండింటినీ చూస్తూ, వింటూ పెరిగాను. ఈ రెండు ప్రపంచాలను కలిపే ఒక గొప్ప సినిమా చేయాలనుకున్నప్పుడు 'కల్కి 2898 ఏడీ' పుట్టింది'' అన్నారు నాగ్ అశ్విన్. ''ఈ సినిమా మాకు గర్వకారణం'' అన్నారు నిర్మాత అశ్వనీదత్. ఈ వేడుకలో రానా, ప్రియాంకా దత్, స్వప్నా దత్ పాల్గొన్నారు. 'కల్కి 2898 ఏడీ'ను 2024 జనవరి 12న రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తా: ప్రభాస్

రామ్‌చరణ్‌తో కలిసి నటిస్తానని ప్రభాస్ 'కామిక్ కాన్–2023' వేడుకల్లో చెప్పారు. ఈ వేడుకల్లో 'ఆర్ఆర్ఆర్' సినిమా ప్రస్తావన రాగా... ''భారతదేశంలో ఉన్న అద్భుతమైన దర్శకుల్లో రాజమౌళి గారు ఒకరు. 'ఆర్ఆర్ఆర్' సినిమాలోని పాటకు ఆస్కార్ రావడం నాకు చాలా సంతోషంగా అనిపించింది. అది దేశ ప్రజలందరికీ దక్కిన గౌరవంగా భావించాం. అలాగే రామ్‌చరణ్ నాకు మంచి మిత్రుడు. ఏదో ఒక రోజు మేం కచ్చితంగా కలిసి సినిమా చేస్తాం'' అని చెప్పుకొచ్చారు ప్రభాస్.


చిరంజీవి, తమన్నా

మిల్కీ బ్యూటీ... నువ్వే నా స్వీటీ

'అచ్చ తెలుగు పచ్చి మిర్చి మగాడు వీడే.. బొంబాటు ఘాటు హాటు హాటుగున్నాడే.. కల్లోకి వచ్చేసి కన్నెగుండెల్లో సూది గుచ్చి పిల్లా నీ ముచ్చటేంది అన్నాడే...' అంటూ రొమాంటిక్ మోడ్‌లోకి వెళ్లిపోయారు హీరోయిన్ తమన్నా. చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన తాజా చిత్రం 'భోళా శంకర్'. ఈ చిత్రంలో చిరంజీవి సరసన తమన్నా నటించగా, ఆయన చెల్లెలి పాత్రలో కీర్తీ సురేష్ నటించారు. మెహర్ రమేష్ దర్శకత్వంలో అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 11న విడుదల కానుంది. ఈ చిత్రంలోని 'మిల్కీ బ్యూటీ.. నువ్వే నా స్వీటీ..' అంటూ సాగే పాట లిరికల్ వీడియోను శుక్రవారం విడుదల చేశారు. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ పాటను విజయ్ ప్రకాష్, సంజన కల్మంజేతో కలసి ఈ చిత్ర సంగీతదర్శకుడు మహతి స్వర సాగర్ ఆలపించారు.


సుదీప్, అమలాపాల్

యాక్షన్ హెబ్బులి

సుదీప్, అమలా పాల్ జంటగా ఎస్. కృష్ణ దర్శకత్వంలో రూపొందిన కన్నడ రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'హెబ్బులి'. ఈ సినిమాను అదే టైటిల్‌తో సి. సుబ్రహ్మణ్యం ఆగస్టు 4న తెలుగులో రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ– ''ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, రొమాంటిక్ సీన్స్ మిళితమై ఉన్న పక్కా కమర్షియల్ ఫిల్మ్ 'హెబ్బులి'. కన్నడంలో రూ. 100 కోట్లు సాధించింది. తెలుగులోనూ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు.


వైష్ణవ్ తేజ్


మహేశ్‌బాబు

కిక్... పంచ్...

విలన్ ముఖం మీద హీరో పంచ్ ఇవ్వాలా? కాలితో ఒక్క కిక్ కొట్టాలా? గాల్లో ఎగిరి పల్టీలు కొట్టి మరీ విలన్‌ని కొట్టాలా? ఇవన్నీ చేయాలంటే కాస్త ట్రైనింగ్ కావాలి. రెగ్యులర్ ఫైట్స్‌కి అయితే అక్కర్లేదు. బీభత్సమైన ఫైట్స్‌కి అయితే శిక్షణ తీసుకోవాల్సిందే. అది హీరో అయినా హీరోయిన్ అయినా. ఈ మధ్య రిస్కీ రోల్స్ ఒప్పుకున్న కొందరు స్టార్స్ 'మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్' నేర్చుకోవడానికి ప్రిపేర్ అయ్యారు. కిక్ బాక్సింగ్, కరాటే, కుంగ్ ఫూ, జూడో, కలరి పయట్టు వంటివన్నీ మార్షల్ ఆర్ట్స్ కిందే వస్తాయి. ఫైట్‌కి సూట్ అయ్యే ఆర్ట్ నేర్చుకుని బరిలోకి దిగనున్న స్టార్స్ గురించి తెలుసుకుందాం.


టొవినో థామస్

మూడు నెలలు బ్యాంకాక్‌లో...
హీరో మహేశ్‌బాబు– డైరెక్టర్ రాజమౌళి కాంబినేషన్‌లో ఓ భారీ చిత్రం రూపొందనున్న విషయం తెలిసిందే. ఆఫ్రికన్ అడవుల నేపథ్యంలో జరిగే ఈ కథలో భారీ యాక్షన్ సన్నివేశాలు ఉంటాయట. పోరాట సన్నివేశాలు సహజంగా ఉండేందుకు కెరీర్‌లో తొలిసారి ఈ సినిమా కోసం మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ నేర్చుకోనున్నారట మహేశ్ బాబు. ఇందుకోసం మూడు నెలల పాటు బ్యాంకాక్ వెళతారని టాక్. అక్కడ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్ ట్రైనింగ్, హైకింగ్, ట్రెక్కింగ్ వంటివి నేర్చుకోనున్నారట. ఈ శిక్షణ ఇవ్వనున్న బ్యాంకాక్ స్టంట్ టీమ్‌కి ఓ హాలీవుడ్ ప్రముఖ స్టంట్ కొరియోగ్రాఫర్ నేతృత్వం వహిస్తారని తెలిసింది. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వం వహిస్తున్న 'గుంటూరు కారం'లో నటిస్తున్నారు మహేశ్‌బాబు. ఈ చిత్రం పూర్తయ్యాక బ్యాంకాక్‌లో శిక్షణ తీసుకుని, రాజమౌళి సినిమా షూట్‌లో జాయిన్ అవుతారట. ప్రస్తుతం ఈ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు రాజమౌళి. ఈ చిత్రానికి రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ కథ అందిస్తున్న సంగతి తెలిసిందే.


కాజల్

థాయ్‌ల్యాండ్‌లో...
తొలి చిత్రం 'ఉప్పెన'తో (2021) బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్నారు వైష్ణవ్ తేజ్. ఆ తర్వాత 'కొండపొలం, రంగ రంగ వైభవంగా' వంటి చిత్రాల్లో నటించారు. ఈ మూడు చిత్రాల్లో సాఫ్ట్ క్యారెక్టర్‌తో ప్రేక్షకులను అలరించిన ఆయన తొలిసారి 'ఆదికేశవ' చిత్రంలో ఫుల్ యాక్షన్ రోల్ చేశారు. శ్రీకాంత్ ఎన్. రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో హై ఓల్టేజ్ యాక్షన్ సన్నివేశాల కోసం థాయ్‌ల్యాండ్‌లో మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు వైష్ణవ్ తేజ్. ఈ చిత్రంలో వైష్ణవ్‌కు జోడీగా శ్రీలీల నటించారు. సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 18న రిలీజ్ కానుంది.

కలరి మార్షల్ ఆర్ట్‌లో...
మలయాళ హీరో టొవినో థామస్ కలరి అనే మార్షల్ ఆర్ట్‌లో శిక్షణ పొందారు. టొవినో థామస్ హీరోగా నటిస్తున్న చిత్రం 'అజయంతే రండం మోషణం'. జితిన్ లాల్ దర్శకత్వం వహిస్తున్నారు. కథ పరంగా కేరళలోని కలరి అనే మార్షల్ ఆర్ట్‌కు ఈ చిత్రంలో ప్రాధాన్యం ఉండటంతో టొవినో థామస్ ఈ విద్యలో శిక్షణ తీసుకుని నటిస్తున్నారు. ఈ చిత్రంలో కృతీ శెట్టి, ఐశ్వర్య రాజేష్, సురభి లక్ష్మి హీరోయిన్లుగా నటిస్తున్నారు.

భారతీయుడు కోసం...
కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న 'భారతీయుడు 2' కోసం కాజల్ అగర్వాల్ మార్షల్ ఆర్ట్స్‌లో శిక్షణ తీసుకున్నారు. 'భారతీయుడు' (1996) సినిమాకి సీక్వెల్‌గా 'భారతీయుడు 2' (తమిళంలో 'ఇండియన్ 2) రూపొందుతోంది. ఈ చిత్రంలో కమల్‌కు జోడీగా కాజల్ నటిస్తున్నారు. ఈ చిత్రంలో పవర్‌ఫుల్ ఫైట్స్ చేయడం కోసం అతిపురాతనమైన యుద్ధ క్రీడ కలరి పయట్టు నేర్చుకున్నారు కాజల్. కలరి సాధన చేస్తున్న ఓ వీడియోను ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసి, 'షావోలిన్, కుంగ్ ఫూ, కరాటే, తైక్వాండో.. వంటి క్రీడలు కలరి నుంచి పుట్టుకొచ్చినవే' అని పేర్కొన్నారామె. ఈ మూవీ కోసం గుర్రపు స్వారీ కూడా నేర్చుకున్నారు కాజల్ అగర్వాల్.

కోలీవుడ్‌లో ఫెఫ్సీ కొత్త నిబంధనలు

- సినిమా షూటింగ్‌లకు ఫెఫ్సీ కొత్త నియమాలు
- వెల్లువెత్తుతున్న విమర్శలు

దక్షిణ భారత సినీ కార్మికుల సంఘం (ఫెఫ్సీ) కొత్త నియమ, నిబంధనలు కోలీవుడ్‌లో చర్చనీయాంశమయ్యాయి. తమిళ చిత్రాలకు స్థానిక నటీనటులు, సాంకేతిక నిపుణులు మాత్రమే పని చేయాలని, తమిళ సినిమాల చిత్రీకరణలు తమిళనాడులోనే జరగాలని, సరైన కారణాలు లేనిదే అవుట్‌డోర్ లొకేషన్స్‌లో షూటింగ్ జరపకూడదని ఫెఫ్సీ కొత్త నియమాలు చేసిందని సమాచారం. అలాగే అనుకున్న సమయంలోపు సినిమా చిత్రీకరణ పూర్తి కాకపోయినా, బడ్జెట్ పరిమితి దాటినా నిర్మాతలకు సరైన కారణాలతో లిఖిత పూర్వకమైన లేఖను సమర్పించాలని, ఒకవేళ ఓ సినిమాకు దర్శకుడే రచయిత అయితే, ఆ సినిమా కథకు సంబంధించి ఏదైనా సమస్య ఉంటే అతనే పరిష్కరించుకోవాలని, ఆ సమస్య ప్రభావం షూటింగ్, నిర్మాతలపై పడకుండా జాగ్రత్త వహించే బాధ్యత కూడా ఆ వ్యక్తే తీసుకోవాలన్నట్లుగా కొన్ని నియమాలను 'ఫెఫ్సీ' తీసుకొచ్చిందట. ఈ కొత్త నిర్ణయాలపై కోలీవుడ్‌లోనే కాదు.. సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. 'ఈ నిబంధనలు ఉన్నప్పుడు తమిళ సినిమాలను తమిళనాడులోనే రిలీజ్ చేసుకోవాలి. కోలీవుడ్‌లో హీరోయిన్లకు కొరత ఏర్పడుతుంది. సినిమాకి వాడే సాంకేతిక సామాగ్రిని కూడా తమిళనాడులోనే తయారుచేసుకోవాలి' అంటూ ఫెఫ్సీ నియమాలపై సోషల్ మీడియాలో కొందరు నెటిజన్లు వ్యంగ్యాస్త్రాలు విసురుతున్నారు. అయితే ఈ కొత్త నియమాలను కొందరు తప్పుగా అర్థం చేసుకున్నారని ఫెఫ్సీ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి పేర్కొన్నారట.